క్లుప్తంగా

ఆధార్ నమోదు కేంద్రం ప్రారంభం

రఘునాథపాలెం: మండల కేంద్రంలోని మీసేవ కేంద్రంలో మంగళవారం ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రాన్ని ఎంఈఓ బి.రాములు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులందరూ ఆధార్ కార్డు కలిగి ఉండేలా చర్యలు చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఐఎస్ కోఆర్డినేటర్ ఎం.చైతన్యకుమార్, సీఆర్పీ భగవాన్, హెచ్‌ఎంలు, విద్యార్థులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై కళా ప్రదర్శన



అవగాహన కల్పిస్తున్న కళాకారులు

ఖమ్మంగాంధీచౌక్: సైబర్ నేరాలపై స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) జిల్లా పరిషత్ శాఖ ఆధ్వర్యాన మంగళవారం కళాకారుల బృందంచే నాటిక, ఆటపాటలు వంటి కళారూపాలతో సైబర్ నేరాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ షేక్ ఇబ్రహీం సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని, అనుమానిస్తే 1930కు, బ్యాంక్ లావాదేవీల కోసం 18001234ను సంప్రదించాలన్నారు.

కాకరవాయి వాసికి డాక్టరేట్



డాక్టరేట్ స్వీకరిస్తున్న ధర్మపురి మధు

తిరుమలాయపాలెం: మండలంలోని కాకరవాయికి చెందిన ధర్మపురి ధర్మపురి మధు ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ లభించింది. హైదరాబాద్‌లో మంగళవారం జరిగిన ఓయూ స్నాతకోత్సవంలో ఇస్రో చైర్మన్ డాక్టర్ వి.నారాయణన్, ఓయూ వీసీ ప్రొఫెసర్ కుమార్ చేతుల మీదుగా పట్టా స్వీకరించారు. ప్రస్తుతం హయత్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫిజిక్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న మధు అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ జి.ఉపేందర్ పర్యవేక్షణలో సమర్పించిన పరిశోధనాత్మక గ్రంథానికి డాక్టరేట్ లభించింది.

అభివృద్ధి పనులపై ఆరా



పనుల నాణ్యతను పరిశీలిస్తున్న కమిషనర్

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలో చేపట్టిన పలు అభివృద్ధి పనులను కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య మంగళవారం పరిశీలించారు. 18వ డివిజన్‌లో ఇటీవల నిర్మాణం పూర్తి చేసిన డ్రెయినేజీలను కమిషనర్ టేపుతో కొలతలు వేయించారు. పనుల నాణ్యతను పరిశీలించారు. ఎంబీ రికార్డుల ప్రకారం నిర్మాణం జరిగిందా లేదా అని ఆరా తీసి పలు అంశాలపై ఇంజనీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పనులు త్వరగా పూర్తి చేయించాలని అధికారులను ఆదేశించారు. ఖాళీ స్థలాల్లో నీళ్లు నిల్వ ఉండకుండా చూడాలని అన్నారు.

విస్తరణ ఆగమాగం..



పీఎస్ రోడ్డు వెంట తొలగించిన మెట్లు, ర్యాంపులు

పీఎస్ రోడ్డు అభివృద్ధిపై నీలి నీడలు

- 60 అడుగుల రోడ్డు విస్తరణకు శ్రీకారం
- మార్కింగ్‌కు విరుద్ధంగా పనులు
- రహదారి అభివృద్ధిపై భిన్న వాదనలు

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని త్రీటౌన్‌లో వ్యాపార కేంద్రంగా విరాజిల్లుతున్న పొట్టి శ్రీరాములు రోడ్డు (పీఎస్‌ఆర్) అభివృద్ధిపై నీలి నీడలు కమ్ముకున్నాయి. వెడల్పయిన రహదారులు, సెంట్రల్ లైటింగ్‌తో ఖమ్మం నగరం దినదినాభివృద్ధి చెందుతున్న క్రమాన పీఎస్ రోడ్డు మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా దశాబ్దాలుగా అభివృద్ధి చెందడం లేదు. 35–36 డివిజన్లకు అనుసంధానంగా 40 అడుగుల వెడల్పుతో ఉన్న ఈ రోడ్డును 60 అడుగుల వెడల్పుతో అభివృద్ధి చేయాలని గతంలో మున్సిపాలిటీ నిర్ణయించినప్పటికీ కార్యరూపం దాల్చలేదు. ఖమ్మం వ్యవసాయ మార్కెట్, గాంధీచౌక్, కాల్వొడ్డు ప్రాంతాలకు విస్తరించి ఉన్న ఈ రహదారి ట్రాఫిక్‌కు అనుగుణంగా అభివృద్ధి లేకపోవడంతో నిత్యం వాహనాల రద్దీ ఉంటుంది.

ట్రాఫిక్‌కు అనుగుణంగా..

నగరంలోని పలు రహదార్లకు లింక్ రోడ్‌గా వ్యాపార కేంద్రానికి ప్రధాన రోడ్‌గా ఉన్న ఈ రహదారిని అభివృద్ధి పర్చాలని మారుతున్న ప్రభుత్వాలు అనేక సార్లు ప్రయత్నాలు చేశాయి. ఈనేపథ్యాన టౌన్ ప్లానింగ్ విభాగం గుంటు మల్లేశ్వర దేవాలయం నుంచి హర్కారా బావి సెంటర్ వరకు 60 అడుగుల వెడల్పుతో రోడ్డుకు మార్కింగ్ చేసింది. ఈ క్రమంలో చాలావరకు వ్యాపార దుకాణాల నిర్మాణాలను తొలగించాల్సి వస్తుండగా.. దుకాణ యజమానులు తమకు నష్టం జరుగుతుందని కార్పొరేషన్ అధికారులు, మేయర్‌ను అభ్యర్థించగా.. వారు రహదారిని పరిశీలించారు. ప్రస్తుతం రహదారి పైకి ఉన్న మెట్లు, ర్యాంపులను తొలగించి ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూసుకుంటామని వ్యాపారులు తమ సొంత ఖర్చులతో వాటిని తొలగించుకుంటూ.. డ్రెయిన్లను నిర్మించేలా పనులకు కార్యాచరణ చేస్తున్నారు. కాగా, రహదారి అభివృద్ధికి కొందరు అడ్డుపడుతున్నారని వాదన ఉండగా, నగరానికి చెందిన వారు ఈ మార్గం అభివృద్ధి అనివార్యమంటున్నారు.

భిన్నవర్గాలకు ప్రయోజనం

భిన్న వర్గాల ప్రజలకు ప్రయోజనం కలిగే పొట్టి శ్రీరాములు రహదారి అభివృద్ధి అనివార్యమైంది. ప్రధానంగా వ్యవసాయ మార్కెట్‌కు అనుసంధానంగా ఉన్న ఈ రహదారిలో రైతులకు అవసరమైన పరికరాలు, పంటలకు వినియోగించే ఎరువులు, పంపుసెట్లు, మత్స్యకారుల, ఇతర వర్గాలకు చెందిన వ్యాపార దుకాణాలు ఉన్నాయి. అయితే రహదారి వెడల్పులో భవనాలను కోల్పోయే వారికి పరిహారం చెల్లించి కొంత మేరకు రహదారిని ఇరువైపులా అభివృద్ధి చేయాలని స్థానికులు, నగర ప్రజలు ఆశిస్తుండగా.. నిర్ణయమంతా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేతుల్లోనే ఉందని స్థానికుల్లో చర్చ జరుగుతోంది. ఈనేపథ్యాన రహదారి యథాతథంగా ఉండాలనుకునేవారు, రహదారి వెడల్పు పెంచాలని వారు వేర్వేరుగా మంత్రిని కలుస్తుండడం గమనార్హం.

మారుతున్న రూపురేఖలు..

పొట్టి శ్రీరాములు రహదారి పరిసర ప్రాంతాల రూపురేఖలు మారుతున్నాయి. ఓ వైపు కాల్వొడ్డు వద్ద మున్నేరుపై రూ. 180 కోట్లతో తీగల వంతెన సిద్ధమవుతుండగా.. మరో వైపు మున్నేరు పొడవునా వందలాది కోట్లతో రిటైనింగ్ వాల్ నిర్మాణాలు జరుగుతున్నాయి. ఇంకోవైపు దేశంలోనే చెప్పుకోదగ్గ విధంగా రూ. 155 కోట్లతో మోడల్ మిర్చి మార్కెట్ నిర్మాణాలు జరుగుతున్నాయి. వందల కోట్లతో అభివృద్ధి జరుగుతుండగా ఈ పనులకు అనుసంధానంగా ఉన్న పొట్టి శ్రీరాములు రోడ్డుపై ప్రభుత్వం పటిష్టమైన చర్యలు తీసుకోలేని స్థితిలో ఉంది. ఇదిలా ఉండగా ఈ రహదారికి సమాంతరంగా ఉన్న గాంధీచౌక్ నుంచి కాల్వొడ్డు వరకు రహదారిని విశాలంగా అభివృద్ధి చేశారు.



ర్యాంపును తొలగిస్తున్న దృశ్యం

అభివృద్ధి జరగాలి..



చరిత్ర కలిగిన పొట్టి శ్రీరాములు రోడ్డు సమస్యలు పరిష్కారమయ్యేలా అభివృద్ధి జరగాలి. వ్యాపారాభివృద్ధి, ఈ ప్రాంత భూమి విలువ పెరగడం, ఉపాధి అవకాశాలు మెరుగుపడడం, ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం లభించేలా వీలైనంత త్వరగా రహదారి అభివృద్ధి చేయాలి.

– గెంట్యాల శ్రీనివాసరావు, పీఎస్ రోడ్డు

అవకాశాన్ని చేజార్చుకోవద్దు..



నగరంలో అన్ని వ్యాపార కేంద్రాల మాదిరిగా పీఎస్ రోడ్డు వ్యాపార కేంద్రంగా అన్ని సౌకర్యాలతో అభివృద్ధి చెందాలి. అప్పుడే ఈ ప్రాంతానికి మరింత ఆదరణ దక్కుతుంది. కొందరికి ఇబ్బందిగా ఉన్నా అభివృద్ధి అవకాశాన్ని చేజార్చుకోవద్దు.

– తాళ్లూరి హనుమంతరావు, హర్కారాబావి సెంటర్

ప్రయోజనాల మేరకే..



అన్ని వర్గాల ప్రజలకు ప్రయోజనం కలిగేలా అభివృద్ధి జరగాలి. అందరి ప్రయోజనాలను పరిగణలోకి తీసుకుని ఎవరూ నష్టపోకుండా చర్యలుండాలి. ఈ రహదారి నగర అభివృద్ధికి తోడ్పడేలా నిర్మించాలి. పీఎస్ రహదారి అభివృద్ధిని కాంక్షిస్తున్నా.

– పసుమర్తి రామ్మోహన్‌రావు, కార్పొరేటర్, 36వ డివిజన్

ఎరువుల కొరత సృష్టిస్తే చర్యలు

కూసుమంచి: ఎరువుల కృత్రిమ కొరత సృష్టించి రైతులను ఇబ్బందులు పెడితే చర్యలు తప్పవని కూసుమంచి ఏడీఏ సతీష్ హెచ్చరించారు. మంగళవారం కూసుమంచిలోని రైతు వేదికలో ఎరువుల డీలర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతుల అవసరాల మేరకు యూరియా, ఇతర ఎరువులను అందించాలని, చిన్న, సన్నకారు రైతులకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఎరువుల స్టాక్ వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని, నానో యూరియా వినియోగంపై రైతులకు అవగాహన కల్పించాలని కోరారు. అంతకు ముందు రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అనంతరం పలు గ్రామాల్లోని ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. ఏఓ వాణి, ఏఈఓలు పాల్గొన్నారు.

వినతి..

మండల రైతాంగానికి యూరియా కొరత లేకుండా చూడాలని కోరుతూ తెలంగాణ రైతు సంఘం నాయకులు మంగళవారం ఏడీఏ సతీష్, ఏఓ వాణికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు ఎడవెల్లి రమణారెడ్డి, బిక్కసాని గంగాధర్ మాట్లాడుతూ.. రైతులు యూరియా కోసం వెళ్తే ఇతర ఎరువులు, పురుగు మందులను అంటగడుతున్నారన్నారు. ఎటువంటి లింకులు లేకుండా యూరియా సరఫరా చేయించాలని, ఎరువుల కొరత లేకుండా చూడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మల్లెల సన్మంతరావు, తోటకూరి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



ఎరువుల దుకాణంలో తనిఖీ చేస్తున్న ఏడీఏ సతీష్

ఇండోర్‌కు కేఎంసీ బృందం

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం నగర పాలక సంస్థ పరిధిలో అభివృద్ధి, పారిశుద్ధ్య నిర్వహణ మరింత మెరుగుపరిచేలా పరిశీలన కోసం పాలకవర్గం స్టడీ టూర్‌కు వెళ్తోంది. మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని ఇండోర్ మున్సిపల్ కార్పొరేషన్‌ను సందర్శించేందుకు కేఎంసీ కార్పొరేటర్లు, అధికారులు మేయర్ పునుకొల్లు నీరజ ఆధ్వర్యాన బుధవారం బయలుదేరనున్నారు. ఈనెల 21, 22 తేదీల్లో ఇండోర్ మున్సిపాలిటీలో పర్యటించే ఈ బృందం పారిశుద్ధ్య పనులు, వ్యర్థాల నిర్వహణ, ఇతర అభివృద్ధి పనులను పరిశీలిస్తారు. ఇప్పటికే కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య ఇండోర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌తో మాట్లాడి కేఎంసీ బృందం పర్యటనకు అందించాల్సిన సహకారంపై చర్చించారు. కాగా, ఖమ్మం నుంచి 43 మంది కార్పొరేటర్లు, ఆరుగురు అధికారుల బృందం ఇండోర్ వెళ్తోందని కమిషనర్ తెలిపారు.

గ్రామాల్లో వైద్యశిబిరాలు నిర్వహించాలి



ఖమ్మం మామిళ్లగూడెం: డీఎంహెచ్‌ఓకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

రఘునాథపాలెం: ఇటీవల కురుస్తున్న వర్షాలకు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించాలని ప్రగతిశీల యువజన సంఘం (పీవైఎల్) జిల్లా అధ్యక్షుడు జే.ప్రేమ్‌సింగ్ తెలిపారు. మండలంలోని రాంక్యాతండాలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పారిశుద్ధ్య సమస్యలపై దృష్టి సారించి ఫాగింగ్, బ్లీచింగ్ పౌడర్ వంటివి పిచికారీ చేయాలని డిమాండ్ చేశారు. ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు ఇంటింటికి తిరిగి మందులు అందించి, ఆరోగ్య చైతన్యం కల్పించాల్సిన బాధ్యత ఉందని అన్నారు. డెంగీ, మలేరియా వంటి వ్యాధులను అరికట్టడంలో నిర్లక్ష్యం చేస్తే డీఎంహెచ్‌ఓ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు దరావత్ రవి, డివిజన్ నాయకులు భజన్, రాంప్రసాద్, బి.రవి, ధరావత్ శంకర్, శివలాల్, వినయ్, రాజా తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై దృష్టి సారించండి

ఖమ్మంమయూరిసెంటర్: వానాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండాఅధికార యంత్రాంగం తగిన చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ ఒక ప్రకటనలో కోరారు. అవసరమైతే అత్యవసర పరిస్థితిని ఎదుర్కొనేందుకు సర్వం సిద్ధం కావాలన్నారు. పెనుబల్లి, కల్లూరు, సత్తుపల్లి తదితర ప్రాంతాల్లో ఆస్పత్రి భవనాల నిర్మాణపూర్తయినా నేటికీ ప్రారంభించలేదని, వర్షాల వల్ల కల్గిన పంట నష్టాన్ని అంచనా వేసి రైతులను ఆదుకునేందుకు పరిహారం ప్రకటించాలని డిమాండ్ చేశారు. పంటల రక్షణకు ప్రతీ గ్రామంలో వ్యవసాయ అధికారులు సమావేశాలు నిర్వహించాలని కోరారు.

డీఎంహెచ్‌ఓకు వినతి..

ఖమ్మం మామిళ్లగూడెం: ప్రజల ఆరోగ్య సమస్యలపై దృష్టి సారించాలని కోరుతూ.. జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి కళావతి బాయికి బీజేపీ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధుల బారిన పడకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు గెంటెల విద్యాసాగర్, అల్లిక అంజయ్య, నల్లగట్టు ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఖమ్మంవ్యవసాయం: నగరంలోని వైరారోడ్ ఫీడర్ మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం 9 నుంచి 11 గంటల వరకు, మామిళ్లగూడెం ఫీడర్ మరమ్మతుల కారణంగా మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని టౌన్–2 ఏఈ బి.రవికుమార్ మంగళవారం తెలిపారు. దీంతో మామిళ్లగూడెం, బుర్హాన్‌పురం, రేవతిసెంటర్, సరితక్లినిక్, మేకలబండ పార్క్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

24, 25న మెగా రక్తదానం

ఖమ్మం మామిళ్లగూడెం: ఖమ్మంలోని కస్బాబజార్ రామాలయం టెంపుల్ సమీపాన ఉన్న బ్రహ్మకుమారి సంస్థ ఆధ్వర్యాన ఈ నెల 24, 25న సంస్థ కార్యాలయంలో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్లు రాజయోగిని బ్రహ్మకుమారి అధిపతి ఖమ్మం ఇన్‌చార్జ్ బీ.కే.అరుణ తెలిపారు. ఖమ్మం ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. సేకరించిన రక్తాన్ని తలసేమియా బాధితులకు, పేషెంట్లకు వినియోగించనున్నట్లు తెలిపారు. మానవ సేవే మాధవ సేవగా భావించి ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయగా.. రక్తదానం చేసే దాతలకు సర్టిఫికెట్లు అందించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో బ్రహ్మకుమారి గీత, బ్రహ్మకుమారి రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

నిధులు విడుదల చేయాలి

ఖమ్మం అర్బన్: అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా పాఠశాలల్లో వివిధ పనుల నిర్వహణకు నిధులు వెంటనే విడుదల చేయాలని పీఆర్‌టీయూ ఖమ్మం అర్బన్ మండల శాఖ నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం జరిగిన కమిటీ సమావేశంలో మండల అధ్యక్షుడు గుడిపూడి శ్రీనివాసరావు, కార్యదర్శి బి.రవికిరణ్ మాట్లాడుతూ.. పాఠశాలలు తెరిచి రెండు నెలలు గడుస్తున్నప్పటికీ వర్కర్లను ఇప్పటివరకు నియమించక అనేక ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. పాఠశాలలు ప్రారంభం నుంచే నిధులు విడుదలయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ నాయకులు పారుపల్లి వెంకటేశ్వరరావు, ఆవుల దర్గయ్య, సత్యనారాయణ, ఎం.రంగారావు, మలీదు రాములు, ఎం.అచ్యుతరావు, మురళీకృష్ణ, నవీన్‌కుమార్, సీహెచ్.ధనలక్ష్మి, జ్యోతి, బి.జయ, కె.సునీత, వెంకటకుమారి తదితరులు పాల్గొన్నారు.

సంతకాల సేకరణ

ఖమ్మంమయూరిసెంటర్: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు పాఠాలు బోధించడానికి అధ్యాపకులు నియమించాలని కోరుతూ ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యాన కళాశాలలో విద్యార్థినుల నుంచి మంగళవారం సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి తుడుం ప్రవీణ్ మాట్లాడుతూ విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా అతిథి అధ్యాపకులను నియమించాలని, లేకుంటే సంఘం ఆధ్వర్యాన ఉద్యమం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నగర నాయకులు త్రినాథ్, లోకేష్, స్నేహ, కావ్య, కళాశాల కమిటీ నాయకులు సాత్విక, శ్రీలత, సింధు, త్రివేణి, కావ్య, నవ్య, మనీషా తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి



పంట పొలాలను పరిశీలిస్తున్న నాయకులు

ఖమ్మంరూరల్: వర్షాలతో పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఉపాధ్యక్షుడు మిడకంటి చినవెంకటరెడ్డి అన్నారు. మండలంలోని తల్లంపాడు, నర్సింహాపురంలలో వర్షాలకు నీట మునిగిన పంట పొలాలను పరిశీలించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. దెబ్బతిన్న పంటలకు బీమా పథకాన్ని అమలు చేఉఆజౌఏౌఉఓఐ. వ్యవసాయ రంగాన్ని కాపాడేందుకు ప్రభుత్వాలు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలని తెలిపారు. పుచ్చకాయల సుధాకర్, ఏలూరి భాస్కర్‌రావు, ఫి.శ్రీను పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణలో భాగస్వాములు కండి

ఖమ్మంమయూరిసెంటర్: డివిజన్లలో నాటే మొక్కలను సంరక్షించే బాధ్యత స్థానికులు తీసుకోవాలని కార్పొరేటర్ శీలంశెట్టి రమావీరభద్రం అన్నారు. 51వ డివిజన్‌లో మంగళవారం వనమహోత్సవంలో భాగంగా స్థానికులతో మొక్కలు నాటించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడగా.. జీహెచ్ఎంసీ ఈఈ వెంకటశేషయ్య, మాజీ కౌన్సిలర్ శీలంశెట్టి వీరభద్రం, స్థానికులు రాయపాటి వీరభద్రం, పి.శరత్, శెట్టి ప్రవీణ్, సాయి, సురేష్ పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	కూలీ
వినోద	వార్–2, మహావతార్ నర్సింహా
సాయిరాం	కూలీ
ఆదిత్య	సు ఫ్రం సొ
శ్రీనివాస	వార్–2, అతడు

– ఖమ్మంగాంధీచౌక్

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	48	బచ్చలికూర	4
వంకాయ	40		20
బెండకాయ	20	పాలకూర	3
పచ్చిమిర్చి	46		20
కాకర	30	చుక్కకూర	3
బోడ కాకర	140		20
బీర	56	తోటకూర	4
దొండ	24		20
పొట్లకాయ	36	గోంగూర	4
చిక్కుడు	50		20
గోరుచిక్కుడు	50	మెంతికూర	3
క్యాబేజీ	20		20
క్యాలీఫ్లవర్	40	కొత్తిమీర	1
ఆలుగడ్డ	24		25
చామగడ్డ	28	పుదీన	1
క్యారెట్	48		20
క్యాప్సికం	60	-ఖమ్మం వ్యవసాయం	

సంక్షిప్తంగా..

హామీల అమలుకు ఉద్యమం



నూతన కమిటీని సన్మానిస్తున్న నాయకులు

నేలకొండపల్లి: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయాన ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలని క్షేత్రస్థాయిలో ఉద్యమించాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వున్నం బ్రహ్మయ్య పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం జరిగిన పట్టణ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయానికి బీఆర్‌ఎస్ శ్రేణులు కృషి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో నాయకులు కాసాని నాగేశ్వరరావు, శీలం వెంకటలక్ష్మి, షేక్ హుస్సేన్, రేపాకుల సూరయ్య, ఖమ్మం కాంతారావు, సోడేపొంగు ప్రశాంత్, మాదాసు ఆదాం తదితరులు పాల్గొన్నారు. కాగా, బీఆర్‌ఎస్ నేలకొండపల్లి పట్టణ అధ్యక్షుడుగా గడ్డం లక్ష్మయ్య ఎన్నికయ్యారు. అలాగే, కార్యదర్శిగా ఎండీ.వాజీద్, ఉపాధ్యక్షుడిగా పగిడికత్తుల వెంకటేష్, యూత్ మండల అధ్యక్ష, కార్యదర్శులుగా సోడేపొంగు ప్రశాంత్, కిషోర్, యూత్ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులుగా పగిడికత్తుల శ్రీకాంత్, సిద్దును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

బహుజనులకు రాజ్యాధికారం బీఎస్పీతోనే సాధ్యం

ఖమ్మం మామిళ్లగూడెం: బహుజనులకు రాజ్యాధికారం బీఎస్పీతోనే సాధ్యమని బీఎస్పీ రాష్ట్ర నాయకుడు దాగిళ్ల దయానందరావు అన్నారు. మంగళవారం ఖమ్మంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీలైన బహుజనులకు రాజ్యాధికారం బహేన్ కుమారి మాయావతి నాయకత్వంలో లభిస్తుందన్నారు. జిల్లాలో మాన్యశ్రీ కాన్షిరాం పని విధానంతో ముందుకు సాగి కమిటీల నిర్మాణాన్ని పూర్తి చేయాలన్నారు. రాష్ట్ర నాయకులు శివరాజ్, పల్లెపొంగు విజయ్‌కుమార్, కర్రీకృష్ణ, మేకతోటి పుల్లయ్య, శ్రీనివాస్ గౌడ్, సీహెచ్.నాగేశ్వరరావు, రామయ్య, నాగరాజు, నాగరాజు, ఖదీర్, అఫ్జల్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నేతల సంతాపం

ఖమ్మంఅర్బన్: నగరంలోని గోపాలపురం 8వ డివిజన్ కాల్వకట్టలో ఇటీవల జరిగిన గొడవలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మృతిచెందిన దేవండుల కార్తీక్ మృతదేహాన్ని మంగళవారం బీఆర్‌ఎస్ నాయకులు సందర్శించి సంతాపం ప్రకటించారు. ఇదే ఘటనలో రాకేష్ అనే వ్యక్తి ఇంకా చికిత్స పొందుతుండగా.. ఆయన ఆరోగ్యంపై ఆరా తీసి బాధిత కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈమేరకు సీహెచ్.రవికిరణ్, బీఆర్‌ఎస్ యూత్ అధ్యక్షుడు దేవభక్తిని కిషోర్ కుటుంబానికి రూ.5వేల ఆర్థిక సాయం అందించగా.. ఎస్టీ సెల్ అధ్యక్షుడు సురేష్, బీసీ విభాగం నాయకులు వీరేందర్, మనోజ్, రాము తదితరులు పాల్గొన్నారు.

నివాళి..

ఖమ్మంఅర్బన్: మమత విద్యా సంస్థల కార్యదర్శి, పువ్వాడ జయశ్రీ తండ్రి బొందలపాటి కృష్ణయ్య మంగళవారం మృతి చెందగా.. పలువురు శ్రీనగర్‌కాలనీలోని ఆయన నివాసంలో నివాళులర్పించారు. బీఆర్‌ఎస్ పార్టీ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ కర్నాటి కృష్ణ, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ మక్బుల్, ఆంధ్రా బ్యాంక్ కర్షకసేవా సంఘం అధ్యక్షుడు బి.రెడ్డినాగచంద్రారెడ్డి, మాజీ డిప్యూటీ మేయర్ బత్తుల మురళీప్రసాద్, సీహెచ్. రవికిరణ్, పొన్నం వెంకటేశ్వర్లు, సుదర్శన్, షకీన, సత్తార్ మియా, వెంకటరమణ తదితరులు నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

చెత్త వాహనాల అడ్డగింత

ఖమ్మంమయూరిసెంటర్: డబుల్‌బెడ్ రూమ్ ఇళ్ల సముదాయానికి రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలనే డిమాండ్‌తో స్థానికులు మంగళవారం చెత్త వాహనాలను అడ్డుకున్నారు. డంపింగ్‌యార్డ్ మీదుగా డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లకు వెళ్లే మార్గంలో సీసీ రోడ్డు నిర్మాణానికి నిధులు కేటాయించిన పనులు పూర్తి కాలేదు. ఇటీవల వర్షాలతో ఈ మార్గంలో గుంతలు, బురదతో అధ్వానంగా మారింది. దీంతో స్థానికులు బుధవారం డంపింగ్‌యార్డ్‌కు వచ్చే చెత్త వాహనాలను అడ్డుకున్నారు. ఈమేరకు పోలీసులు చేరుకొని వారికి నచ్చచెప్పినా.. మధ్యాహ్నం వరకు తరలింపులో ఇబ్బందులు తలెత్తాయి.

ఇళ్ల స్థలాలు ఇవ్వడంలో నిర్లక్ష్యం

తిరుమలాయపాలెం: తిరుమలాయపాలెంలో గత రెండేళ్ల క్రితం బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ఇచ్చిన ఇళ్ల పట్టాలకు స్థలాలు చూపించకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని సీపీఎం మండల కార్యదర్శి శ్రీను ఆరోపించారు. మంగళవారం ఇళ్ల స్థలాలను పరిశీలించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ విషయంపై మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి విన్నవించగా.. పొజిషన్ చూపించాలని ఆదేశించినప్పటికీ ఆర్డీఓలు, తహసీల్దార్ స్పందించడం లేదన్నారు. ఇకనైనా పొజిషన్ వెంటనే చూపించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల నాయకులు తుళ్లూరు నాగేశ్వరరావు, నెరుసుల వెంకటేష్, కొమ్ము నాగేశ్వరరావు, దొండేటి నిర్మల్ రావు, బాబు పాల్గొన్నారు.

గతించిన ఘటనలకు సజీవరూపం..



మాట్లాడుతున్న మేయర్ నీరజ

ఖమ్మం మామిళ్లగూడెం: సృష్టిని బంధించేది, గతించిన ఘటనలకు సజీవరూపం ఫొటో అని మేయర్ పూనకొల్లు నీరజ అన్నారు. మంగళవారం ఖమ్మం భక్తరామదాసు కళాక్షేత్రంలో వరల్డ్ ఫొటోగ్రఫీ దినోత్సవంలో భాగంగా జిల్లా ఫొటో అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన ఫొటో కాంపిటేషన్‌లో విజేతలకు బహుమతులు అందించి మాట్లాడారు. ప్రపంచం సామాజిక మాధ్యమాలతో పోటీ పడుతున్న ఈ తరుణంలో ఫొటోలకు గొప్ప ఆవశ్యకత ఉందన్నారు. అనంతరం జిల్లాలో సీనియర్ ఫొటోగ్రాఫర్లను సన్మానించారు. ఆతర్వాత 150 మంది ఫొటోగ్రాఫర్లు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కమర్తపు మురళి, ఖమ్మం జిల్లా ఫొటో అండ్ వీడియోగ్రాఫర్ అధ్యక్షుడు మారగాని వెంకట్, ఎల్‌ఈడీ రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షుడు కన్నెగుండ్ల అశోక్, ప్రధాన కార్యదర్శి పిన్ని కనకారావు, కోశాధికారి నిరుడు తిరుపతిరావు, సీనియర్ ఫొటోగ్రాఫర్లు వేములు నాగరాజు, వేముల నరసింహారావు, హరినాథ్, తిరుమలరావు, రఘు, బాబా, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.


అన్నదానం..



దివ్యాంగులతో సీఐ, ఫొటోగ్రాఫర్లు

రఘునాథపాలెం: ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని రఘునాథపాలెం మండలం ఫొటోగ్రాఫర్ల అసోసియేషన్ ఆధ్వర్యాన మంగళవారం మదర్ థెరిస్సా అనాథాశ్రమంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీఐ ఉస్మాన్ షరీఫ్ పాల్గొని ఆశ్రమంలోని వృద్ధులు, మానసిక దివ్యాంగులు, అనాథలకు పండ్లు, బ్రెడ్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫొటోగ్రాఫర్ల అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ఫొటోగ్రాఫర్‌కు అవార్డు..



మంత్రి చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న సంపత్

ఖమ్మంఅర్బన్: ఖమ్మంకు చెందిన చావా సంపత్‌కుమార్ రాష్ట్ర స్థాయి ఉత్తమ ఫొటోగ్రాఫర్ అవార్డు అందుకున్నారు. ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని సందర్భంగా నిర్వహించిన పోటీల్లో ఆయన అవార్డు గెలుచుకోగా, హైదరాబాద్‌లో మంగళవారం ఏర్పాటుచేసిన సమావేశంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చేతుల మీదుగా అవార్డు స్వీకరించారు. ఇందిరమ్మ ఇళ్లు, రాజీవ్ యువ వికాసం విభాగాల్లో తీసిన ఫొటోలకు సంపత్ పురస్కారానికి ఎంపికయ్యారు.